
బాలనగర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది


బాలనగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు

# స్వచ్ఛతకు నిలయం 'బాలనగర్'

● గ్రామాలకు ఆదర్శంగా.. పక్కా ప్రణాళికతో అభివృద్ధి పనులు ● పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి ● సత్ఫలితాలు అందిస్తున్న 'పల్లెప్రగతి'

**ప్రతి పల్లె పచ్చదనం, పరిశుభ్రతో కళ కళ లాడాలనే గొప్ప సంకల్పంతో 2019లో సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన 'పల్లెప్రగతి' నేడు సత్ఫలితాలను ఇస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావడంతో నేడు ప్రతి పల్లె అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయి. 'పల్లెప్రగతి'లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ 'బాలనగర్' గ్రామ పంచాయతీ మెదక్ మండలంలోనే పలు గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ప్రతి పైసాను పక్కా ప్రణాళికతో ఖర్చు చేస్తూ.. స్వచ్ఛతకు నిలయంగా.. పచ్చదనం, పరిశుభ్రతతో కళ కళాడుతున్నది.**


పల్లె ప్రగతి ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసుకువెళ్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మెదక్ రూరల్, అక్టోబర్ 29: మెదక్ మండలంలోని బాలనగర్ పంచాయతీ ఒకప్పుడు ఎక్కడిక్కడ చెత్త కుప్పలు, పెరుకుపోయిన మురుగునీరుతో కళ హీనంగా ఉండేది. కానీ నేడు, ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామాల అభివృద్ధికోసం ప్రవేశపెట్టిన 'పల్లెప్రగతి'తో బాలనగర్ రూపురేఖలే మారిపోయాయి. 'పల్లెప్రగతి'లో భాగంగా ఏర్పాటు చేసుకున్న డంపింగ్‌యార్డ్, వైకుంఠధామం, పల్లెప్రకృతి వనంతో బాలనగర్ సరి కొత్త కళను సంతరించుకుంది. ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకుంటూ ప్రగతిబాటన పయనిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులతో పాటు పన్నుల రూపంలో బాలనగర్‌కు ఏటా మరో రూ.65 వేల ఆదాయం వస్తున్నది. ప్రజాప్రతి నిధుల సమన్వయంతో ప్రక్కాప్రణాళిక ప్రకారం నిధులను ఖర్చు చేసి గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దారు. పారిశుధ్య పనులు, హరితహారం మొక్కల పెంపకం, గ్రామంలో పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడుతున్నది. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం స్థానికులకు ఆహ్లాదం పంచుతున్నది. డంపింగ్ యార్డు వైకుంఠధామం నిర్మాణం పూర్తి కాగా గ్రామ పంచాయతీ భవనం, క్రీడా మైదానం నిర్మాణం చివరిదశలో ఉన్నాయి. గతంలో పల్లెలో రోడ్లు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు గ్రామాలు నేడు తెలంగాణ ప్రభుత్వంలో రహదారుల వెడల్పు, కొత్త రోడ్లు మంజూరు , పల్లెలో మట్టి రోడ్లను సీసీరోడ్లుగా మారడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీటిని పడుతున్నారు. దీంతో పచ్చటి మొక్కలతో బాలనగర్ కళకళలాడుతుంది. ఇంటింటికి మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో బాలనగర్ గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


సర్పంచ్ పర్యవేక్షణలో రోడ్డకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలిగిస్తున్న సిబ్బంది

### పల్లె ప్రగతితోనే రూపురేఖలే మారాయి



గతంలో బాలనగర్‌లో పాత ఇండ్లు, చెత్తాచెదారంతో నిండిపోయేవి. గత ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదు. 2019లో సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టిన 'పల్లెప్రగతి' వల్లే నేడు మా ఊరు రూపురేఖలే మారిపోయాయి. గ్రామంలో ప్రతి వీధిల్లో సీసీరోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేశాం. ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నాం. ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహకారంతో జిల్లాలోనే ఆదర్శ పల్లెగా బాలనగర్ అభివృద్ధి చేసుకుంటున్నాం. రానున్న రోజుల్లో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటాం.

**– వికాస్, బాలనగర్ సర్పంచ్**


పాపన్నపేటలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ బిల్ నాయక్

## సీఎం కేసీఆర్‌తోనే తండాల అభివృద్ధి

● హుస్నాబాద్ మాజీ జడ్పీటీసీ బిల్ నాయక్

పాపన్నపేట, అక్టోబర్ 29: గిరిజన తండాల అభివృద్ధి కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మాజీ జడ్పీటీసీ బిల్ నాయక్ అన్నారు. సిద్ధిపేట ఉప సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరసింహ నాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు సత్యం తదితరులతో కలిసి ఆయన ఆదివారం పాపన్నపేట మండల పరిధిలోని అమిర్యా తండా, సోమ్లా తండా, నర్సింగరావుపల్లి తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పాపన్నపేటలో మాట్లాడుతూ కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, తండాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కేవలం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. గిరిజనులంతా మరోసారి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిని భారీ మెజార్టీ గెలిపించాలని కోరారు. మెదక్ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమన్నారు. వారి వెంట రైతు సమన్వయ సమితి పాపన్నపేట నాయకులు గడిల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పూల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సర్పంచ్

## కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

రేగోడ్, అక్టోబర్ 29: తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై మండలంలోని ఆర్‌టిక్యాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 12 కుటుంబాలు ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ మేరకు సర్పంచ్ సుంకె రమేశ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకువచ్చారని కొనియాడారు. బేగరి రవీందర్, గంగారాం, సాయిలు, ముఖేశ్, యాదయ్య, అశోక్ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ నుంచి వెళ్లిపోయిన మరికొందరు మళ్లీ సొంత గూటికి చేరారన్నారు. కార్యక్రమంలో బక్కప్ప, మల్లయ్య, అంజయ్య, వీరయ్య, వార్డు మెంబర్ దేవయ్య, హన్మయ్య, రాములు స్కూల్ చైర్మన్ ఆంజనేయులు, యూత్ అధ్యక్షుడు సాయిబాబా, వెంకటేశం పాల్గొన్నారు.

## ఆధార్ అప్‌డేట్‌కు గడువు లేదు

రేగోడ్, అక్టోబర్ 29: ఆధార్ అప్‌డేట్స్ కోసం గడువు లేదని ఆదివారం మెదక్ జిల్లా మేనేజర్ శశికాంత్ తెలిపారు. జిల్లా మొత్తంలో ఉన్న ఆధార్ సెంటర్‌ల్లో రోజుకు సుమారు 20–40 వరకు మాత్రమే ఆధార్ అప్‌డేట్స్ అవుతున్నాయని, సర్వర్ సమస్య, వేలిముద్రలు, ఐరిస్ తొందరగా రాకపోవడంతో 20–40 కంటే కావడంలేదన్నారు. ఆధార్ అప్‌డేట్స్ నిరంతర ప్రకియని, ప్రజలు సహకరించాలన్నారు. నిత్యం ఎంతో మంది ఆధార్ సెంటర్ల వద్దకు వచ్చి ఇబ్బందిపడుతున్నారని ఈ నేపథ్యంలో అవకాశం ఉన్నప్పుడు ఎప్పుడైనా ఆధార్ అప్‌డేట్స్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

## మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

మెదక్ రూరల్, అక్టోబర్ 29: మెదక్ మండలంలోని మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్ట మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం ఆలయ నిర్వాహకులు పూజరి మల్లన్న ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులు మంగళహారుతులతో ఒడిబియ్యం సమర్పించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## రక్తందానంపై అపోహలు వద్దు


మెదక్: రక్తదానం చేస్తున్న పోలీసులు

మెదక్ అర్బన్, అక్టోబర్ 29: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఆదివారం ఎస్పీ రోహిణిప్రియదర్శిని మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం సంఘ విద్రోహశక్తులతో పోరాడి పోలీసులు ప్రాణత్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాలను వెలకట్టలేనివని కొనియాడారు. ప్రతి ఒక్కరూ అమరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. తలసేమియా, క్యాన్సర్, మెడికల్ ఎమర్జెన్సీ పేషంట్లు, బ్లడ్ కేన్సర్ రోగులు, హిమోఫీలియా, ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని, రక్తందానంపై అపోహలు వద్దని, అరోగ్యవంతులంతా రక్తదానం చేయాలని ఎస్పీ సూచించారు.

## కుమ్మరి సంఘం కార్యవర్గం ఏకగ్రీవం


కొల్చారం: కోనాపూర్ మల్లన్న దేవాలయంలో సమావేశమైన కుమ్మరి సంఘం నాయకులు

కొల్చారం, అక్టోబర్ 29: కొల్చారం మండల కుమ్మరి(శాలి వాహన) సంఘం అధ్యక్షుడిగా కుమ్మరి భూమయ్య(పైతర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని కోనాపూర్ మల్లన్న ఆలయ ఆవరణలో నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మరి సంఘం అధ్యక్షుడు కుమ్మరి శంకరయ్య ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి కుమ్మరి సురేశ్ ప్రజాపతి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశమై మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కుమ్మరి సత్తయ్య ప్రజాపతి(పైతర), ఉపాధ్యక్షులుగా కుమ్మరి నాగరాజు(ఎనగండ్ల), ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి కుమార్ ప్రజాపతి(కొల్చారం), కుమ్మరి ఏడు కొండల్(కొల్చారం), కోశాధికారిగా కుమ్మరి రవి ప్రజాపతి(ఎనగండ్ల), సమాచార, ప్రచార కార్యదర్శులుగా కుమ్మరి నరేశ్ ప్రజాపతి(పైతర),కుమ్మరి గురుజై ప్రజాపతి(పోతంశెట్‌పల్లి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సోషల్ మీడియా జనరల్ సెక్రటరీ కుమ్మరి గణేశ్, నర్సాపూర్ నియోజక వర్గ కుమ్మరి సంఘం ప్రచార కార్యదర్శి కుమ్మరి గంగయ్య పాల్గొన్నారు.